క్లుప్తంగా

'డ్రంక్ అండ్ డ్రైవ్' లో 40 మందికి జరిమానా



జోడుగుళ్లపాలెం కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆరిలోవ: ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. హనుమంతవాక, జోడుగుళ్లపాలెం కూడళ్లలో రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 40 మంది వాహనచోదకులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. దీంతో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకెండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు 185 సెక్షన్ ఎంవీ యాక్ట్ ప్రకారం రూ.46,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని ఆయన హెచ్చరించారు.

కొనసాగిన గెడ్డలో పూడిక తొలగింపు



గెడ్డలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–10లోని గెడ్డలో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులు గురువారం కూడా కొనసాగాయి. స్థానికుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ పారిశుధ్య విభాగం కొద్ది రోజులుగా ఈ పనులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గెడ్డలో పూడిక కారణంగా వర్షపు నీరు వెళ్లే దారిలేక స్థానికంగా రహదారులు జలమయమయ్యాయి. దీంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల పర్యవేక్షణలో మురుగునీటి ప్రవాహానికి అనుగుణంగా గెడ్డను తీర్చి దిద్దుతున్నారు. గెడ్డను ఆనుకుని ఉన్న అక్రమణలను సైతం తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో అధునాతన సేవలు



రూ. లక్ష విరాళం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బీచ్‌రోడ్డు: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్)కు లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో అధునాతన సేవలు అందుబాటులో ఉన్నాయని లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆస్పత్రి నిర్వాహకుడు ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు తెలిపారు. లయన్స్ క్లబ్ నుంచి రు.లక్ష విరాళం గురువారం ఆస్పత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను 50 మంది మహిళలకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉషారాజు, పద్మావతి, తదితురలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వ్యర్థాల తొలగింపు



శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఏయూ క్యాంపస్: పారిశుధ్య సిబ్బంది అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. వర్షాకాలంలో సైతం వీరు నిరంతరం సేవలు అందిస్తున్నారు. పెదవాల్తేరు నౌకా నగర్ నుంచి ఏయూ విద్యార్థుల హాస్టల్‌కు వెళ్లే మార్గంలో వ్యర్థాలు రోడ్డుపై పేరుకుపోయాయి. పారిశుధ్య సిబ్బంది గురువారం వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు.

ప్రయత్నం.. సఫలీకృతం

- వర్సిటీలో నాటిన మొక్కలకు కొత్త శక్తి
- వరుస వర్షాలతో జీవం



హాస్టల్‌కు వెళ్లే మార్గంలో నాటిన మొక్కలు



రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు

ఏయూ క్యాంపస్: ఎంతో ఉన్నతాశయంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు చేపట్టిన మొక్కల పెంపకం కార్యక్రమం సఫలీకృతమైంది. ఇటీవల కడియం నర్సరీ నుంచి రెండు నుంచి మూడు సంవత్సరాల వయస్సు కలిగిన మొక్కలను ప్రత్యేకంగా తీసుకొచ్చి, 20 రోజుల పాటు శ్రమించి ప్రణాళికాబద్ధంగా రహదారులకు ఇరువైపులా నాటారు. మొక్కను నాటిన వెంటనే రక్షణకు ప్రత్యేకంగా కంచెను సైతం ఏర్పాటు చేశారు. మొక్కలు నాటి నిత్యం నీరుపోస్తూ వీటిని రక్షిస్తున్నారు. తాజాగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు మొక్కలు నాటుకోవడానికి మరింత ఉపయోగకరంగా మారాయి. దీంతో నాటిన ప్రతి మొక్క పూర్తిగా కొత్త శక్తిని నింపుకొంటోంది. సకాలంలో మొక్కలను తీసుకువచ్చి నాటడం సత్ఫలితాలను ఇస్తోంది. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వెనుక రహదారికి ఇరువైపులా, ఊర్ధ మైదానం వెనుక భాగంలో, మెటా హాస్టల్ నుంచి న్యాయ విద్యార్థుల హాస్టల్స్‌కి వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా క్రమపద్ధతిలో వీటిని నాటారు. రహదారికి దాదాపు 15 అడుగుల దూరం వరకు వదిలిన తరువాత మొక్కలను నాటారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ జరిపినా చెట్లకు ఇబ్బంది కలగకుండా ఈ జాగ్రత్త తీసుకున్నారు. ప్రస్తుతం కొత్తగా నాటిన ప్రతి మొక్క చిగుర్లు వేస్తూ కనువిందు చేస్తున్నాయి. కొన్ని చోట్ల మొక్కలను పశువులు తినివేస్తున్నాయి. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



పశువులు తినేసిన మొక్కలు

వైభవంగా శ్రీవారి తిరుప్పావడ సేవ



శ్రీ వెంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ దృశ్యం

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. వైదిక ధర్మ ప్రకారం ఈ సంస్థలు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక, శ్రీవారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి చిత్ర పటానికి ప్రత్యేక అలంకరణతో పాటు విశిష్ట పూజలు చేశారు. వివిధ రకాల పూలు, ఆహార పదార్థాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా బీవీకే కళాశాల విద్యార్థులతో చేపట్టిన శ్రీని వాస గద్య సమర్పణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా 'నరవ'



నియామక పత్రం స్వీకరిస్తున్న నరవ ప్రకాశరావు

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ సదరన్ రీజియన్ వార్షిక సమావేశం సారథి స్టూడియోలో జరిగింది. ఈ సమావేశాలకు ఆంధ్ర, తెలంగాణతో పాటు, కర్ణాటక, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమతో పాటు ప్రేక్షకుల్లో వచ్చిన మార్పులపై చర్చించినట్టు నరవ తెలిపారు. అనంతరం మూడేళ్ల కాల పరిమితికి ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తాను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యాయని నరవ తెలిపారు.

లలితాదేవి దుష్ట శిక్షణపై ప్రవచనం



ప్రవచిస్తున్న మాతా రమ్యానంద భారతీ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో ప్రతి రోజూ సాయంత్రం శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమ జరుగుతోంది. శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని లలితాదేవి అమ్మవారి సేన ఆవిర్భావం, అమ్మవారు ఎలా దుష్టశిక్షణ చేసి తన బిడ్డలను రక్షించింది, సేనలోని వివిధ దేవతలను ఎలా ఉపాసించాలి, దాని ద్వారా ఎటువంటి సత్ఫలితాలు పొందవచ్చో భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు మాతాజీ చేతుల మీదుగా ప్రసాదం అందించారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వనాంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లలితాపారాయణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'భారత ఆర్థిక వృద్ధికి విశాఖ తోడ్పాటు'

బీచ్‌రోడ్డు: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు అందించే సామర్థ్యం విశాఖపట్నానికి ఉందని హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా తెలిపారు. హరి కృష్ణ గ్రూపు ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం క్లస్టర్ మీట్ నిర్వహించారు. ఫ్రాంచైజ్ మోడల్ ద్వారా వ్యాపార వృద్ధిని పెంచుతూ అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కిస్నా ఏపీ రీజనల్ మేనేజర్ మహేష్ గందానీ, పరాగ్ షా, నికుంజ్ కోరట్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

దాబాగార్డెన్స్ : ఆంధ్ర రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదని, విశాఖకు, రాష్ట్రానికి బీజేపీ తీరని ద్రోహం చేస్తుందని సీపీఎం రాష్ట కార్యదర్శివర్గ సభ్యుడు కె లోకనాథం ఆరోపించారు. పోరాడి సాధించుకుందామన్న పట్టుదల ప్రజా ప్రతినిధులకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్ర, తెలంగాణ పార్లమెంట్ సభ్యులు వేసిన ప్రశ్నలకు హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ సమాధానమిస్తూ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు రూ.106.89 కోట్లు గత నవంబరులో కేటాయించినట్టు తెలిపారు. ఈ బడ్జెట్‌లో రూ.10 కోట్లు మాత్రమే కేటాయించామని చెప్పారు. ఇది అత్యంత ద్రోహమని, దీన్ని బట్టి విశాఖ రైల్వే జోన్ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఏమిటన్నది అర్థమవుతుందన్నారు. ఇక్కడున్న బీజేపీ నాయకులు డీపీఆర్ తయారై పోయిందని, దీనికి స్పెషల్ ఆఫీసర్ కేటాయించారని ఊకదంపుడు ఉపన్యాసాలు గుప్పిస్తుండడం సిగ్గుచేటన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ పేరిట అమ్మకానికి పూనుకుంటున్నట్టు మరోసారి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామ్ ప్రకటించడం పచ్చి దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి. కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఎంవీపీ కాలనీ: వాసవీ క్లబ్ ఎంవీపీ కపుల్స్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో గురువారం డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్మన్ సాంబమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు



బాడీబిల్డర్‌కు ట్రాక్‌సూట్ అందిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: మండలంలోని న్యూ పెంటమాంబ జిమ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు హాజరు కానున్న బాడీ బిల్డర్లకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గురువారం ట్రాక్ సూట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజేతలకు మిస్టర్ విశాఖ టైటిల్‌తో పాటు ఇరవై వేల రూపాయలు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

ఉద్దేశ పూర్వకంగానే 'ఉక్కు' ఉత్పత్తికి ఆటంకం

- విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను అడ్డుకుంటాం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 896వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి గంగవరం పోర్టు యాజమాన్యం కావాలనే ఆటంకం కలిగిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కావాల్సిన కుకింగ్ కోల్ తరలింపునకు అడ్డు తగులుతూ విశాఖ ఉక్కుపై విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను కార్మికులందరం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 896వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ప్రైవేటీకరణకు సహకరిస్తున్న గంగవరం పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్ మధ్య హ్యాండ్లింగ్ చార్జీల లావాదేవీలు నిరంతరం జరుగుతుంటాయని, కానీ, ఇటీవల ఉద్దేశపూర్వకంగానే అదాని గంగవరం పోర్టు యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవరోధాలు కల్పిస్తోందని ఆరోపించారు. పోర్టు యాజమాన్యం త్వరితగతిన సమస్యను పరిష్కరించకపోతే గంగవరం పోర్టుకు అనుసంధానమైన రోడ్డు, రైళ్లు, వేగన్లు, నీరు, విద్యుత్ వంటివాటిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి తోడుగా గంగవరం పోర్టు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆసన్నమైందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవావర్చార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోతకు గురైన తీరం



తీరంలో కోరుకుపోయిన ఇసుక

బీచ్ రోడ్డు: భారీ వర్షాలకు సముద్ర తీరం కోతకు గురైంది. బీచ్‌లోని పిల్లల పార్కు, కొబ్బరి చెట్ల వద్ద ఏర్పాటు చేసిన భద్రత గోడ భారీ అలలకు కొట్టుకుపోయింది. అలల ఉధృతికి ఇసుక మొత్తం కోరుకుపోయి తీర ప్రాంతం అస్తవ్యస్తంగా కనిపిస్తోంది.

విద్యా సమాచారమ్

ఆంధ్ర టెక్ లీగ్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: సాంకేతిక రంగంలో యువతను ప్రోత్సహించేలా ఆంధ్ర టెక్ లీగ్ నిర్వహిస్తున్నట్టు టెక్ టీం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి..ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైనల్ పోటీలు ఏయూ ఆ హబ్ వేదికగా అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. డిజైన్ థింకింగ్, త్రీ డీ ప్రింటింగ్, కోడింగ్, రోబోటిక్స్, డ్రోన్స్, హ్యూమనాయిడ్ రోబోట్ అంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టెక్ టీం సొల్యూషన్స్ నిర్వాహకులు ఎస్.వెంకటరెడ్డి, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరప్ప, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్



విద్యార్థులతో ఏయూ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సోషల్ వర్క్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'గ్రామీణ ప్రాంతాలలో ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహించాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. యూబీఏ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ గ్రామాల్లో యూబీఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సోని హవీల, తదితరులు పాల్గొన్నారు.

21వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజలకు పథకాలను వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డు ఏయూ అవుట్ గేట్ ప్రాంతంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల కోసం వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించిందని, ఆ నిధులతో రోడ్లు, కాలువలు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాదుల భాగ్యనంద్, సంగీతరావు, ధర్మ, వేణు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అంధకారం!



సుందరయ్యకాలనీలో వెలగని వీధి దీపాలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో వీధి దీపాలు నిర్వహణ అంతంత మాత్రంగా మారింది. జీవీఎంసీ 9, 12 వార్డుల పరిధి కొండవాలుతో పాటు పలు ప్రాంతాల్లో రాత్రి వేళ చీకట్లు అలముకున్నాయి. జీవీఎంసీ 9వ వార్డు ప్రశాంతినగర్‌తో పాటు సింహగిరి కాలనీ సగ భాగంలో కొన్నాళ్లుగా విద్యుత్ దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. 12వ వార్డు పరిధిలో ఉన్న కొండవాలు భాగం సింహగిరి కాలనీలో కొంత భాగంతో పాటు సుందరయ్య నగర్‌లో కొన్నాళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాలైన సింహగిరి కాలనీ, ప్రశాంతినగర్‌లలో 91/బీ/3/2 విద్యుత్ స్తంభం నుంచి వరుసగా 30కి పైగా స్తంభాలకు వెలగని బల్బులను ఈ నెల 18, 19 తేదీలలో జీవీఎంసీ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ బాగు చేశారు. ఆ దీపాలు నాలుగు రోజుల పాటు వెలిగి మళ్లీ పాడయ్యాయి. సందరయ్యనగర్‌లో 20కి పైగా స్తంభాలకు ఉన్న బల్బులు పాడైపోయాయి. వీటిని జూన్ 14, 15 తేదీలలో కాంట్రాక్టర్ బాగు చేయడంతో వారం పాటు వెలిగి మళ్లీ ఇప్పుడు పాడయ్యాయి. కాంట్రాక్టర్ పాడైన బల్బులు తొలగించకుండా తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కొద్ది రోజుల పాటు విద్యుత్ దీపాలు పనిచేసి మొరాయిస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన బల్బులను పూర్తిగా తొలగించి కొత్తవి అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



గరుడసేవను నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలను వెంటబెట్టుకుని స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేణ పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజలో 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ పూజలను నిర్వహించారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాద్రినాథునికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా గరుడసేవ

సింహాచలేశునికి గురువారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

గీతం ఎంబీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలకు గానూ విశాఖ ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సిల్‌ను నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర తెలిపారు. ఎంబీఏలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, సప్‌లెచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ ఎనలటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్‌లో స్పెషలైజేషన్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.